ప్రజలను దోచుకునేందుకే ఎల్ ఆర్ఎస్ : ఎంపీ బడుగుల

సూర్యాపేట, మార్చి 7 : ప్రజలను పీడించి దోచుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను అమలు చేస్తున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ ఎస్.వెంకట్రావ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అందిస్తామని నేటి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. వారు ఇచ్చిన హామీనే అమలు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుందని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మంది నుంచి దాదాపు రూ.20 వేల కోట్లు దోచుకునే కుట్ర పన్నిందని తెలిపారు. కేవలం సూర్యాపేట మున్సిపాలిటీలోనే 30 వేల మంది నుంచి దాదాపు రూ.500 కోట్లు వసూలు చేసే పని పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, ఎంపీపీ నెమ్మాది భిక్షం, జడ్పీటీసీలు జీడి భిక్షం, సైదిరెడ్డి, నాయకులు తుడి నర్సింహారావు, బూర బాలసైదులుగౌడ్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమీల

కోదాడ టౌన్ : మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమీల, కమిషనర్ రమాదేవిని సన్మానిస్తున్న మహిళ ఉద్యోగులు, కౌన్సిలర్లు

కోదాడ టౌన్/కోదాడ రూరల్, మార్చి 7 : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే సామజాభివృద్ధి సాధ్యమవుతుందని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలో మున్సిపల్ కమిషనర్ రమాదేవితో కలిసి మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో ఆడ, మగ అనే వివక్ష చూపకుండా పెంచాలన్నారు. పట్టణంలోని ప్రగతి మహిళా మండలిలో అధ్యక్షురాలు నూనె సులోచన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మల్లెల రాణి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుండి రాణించాలని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు కల్లూరి పద్మజ, వంటిపులి రమాదేవి, కొల్లా ప్రసన్నలక్ష్మి, తిపిరిశెట్టి సుశీలరాజు, మేదిర లలిత, కట్టెబోయిన జ్యోతీశ్రీనివాస్, కర్రి శివసుబ్బారావు, బెజవాడ శిరీష, కో-ఆప్షన్ సభ్యురాలు వంటెపాక జానకీ, జడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి, హెచ్ఎం సలీమా పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

నేరేడుచర్ల : సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని మహిళా వేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.లక్ష్మి అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయం ఎదుట మహిళా సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. లింగ వివక్షతలు లేని సమాజ నిర్మాణమే అంతర్జాతీయ మహిళా వేదిక లక్ష్యమన్నారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అలక సరిత, కౌన్సిలర్ సుగుణను ఘనంగా సన్మానించారు.

అనంతగిరి : మండలంలోని మహిళా సమాఖ్య కార్యాలయం, త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు, ఎంపీడీ నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథులుగా, పీహెచ్‌సీలో జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, మెమోంటోలు అందజేసి వారిని సన్మానించారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో పలువురు మహిళలను మహిళా సమాఖ్య మండలాధ్యక్షురాలు ఏల్పుల రామతార సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం కరుణాకర్, సీసీలు ముత్తయ్య, సరస్వతి, గీత, ఉదయ్‌కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్వపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీబీకేలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సిబ్బందిని అలాగే తిమ్మాపురం మండల పరిషత్ పాఠశాలల మహిళా ఉపాధ్యాయులను ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీ నర్సయ్యయాదవ్ ఘనంగా సన్మానించారు. ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మారిపెద్ది భవానీశ్రీనివాస్‌గౌడ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ సందీప్‌కుమార్, ఏపీఎం మల్లేశ్, హెచ్ఎం రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్వపల్లి : మహిళలను సన్మానించిన ఎంపీపీ రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్

పెన్‌పహాడ్ : మహిళలు స్వశక్తితో ఎదుగాలని ఏపీఎం అజయ్‌నాయక్ అన్నారు. మండల సామాఖ్య కార్యాలయంలో మహిళా ఉద్యోగులను సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ నరేశ్, ఏఓ కృష్ణసందీప్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోతె : మహిళాభివృద్ధికి కృషి చేయాలని తాసీల్దార్ సంఘమిత్ర, ఎంపీడీఓ హరిసింగ్ అన్నారు. మహిళా సమాఖ్య కార్యాలయంలో పలువురు మహిళలను సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటాచారి పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తాసీల్దార్ హేమమాలిని, ఏపీఎం రామలక్ష్మి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగమ్మ, ఏపీఎం స్వరూప, సీసీ పరిమళ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనారవి

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనారవి

హుజూర్‌నగర్, మార్చి 7 : హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనారవి అన్నారు. గురువారం మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవి దృష్ట్యా ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. నీటి ఎద్దడి నివారణ కోసం ప్రత్యేక నిధులను తీర్మానం చేసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోతిరెడ్డి, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మూగ జీవాలకు నీటి కొరత లేకుండా చూడాలి

నేరేడుచర్ల : వర్షాభావ పరిస్థితులు, అడుగంటిన భూగర్భ జలాలు, రోజు రోజుకు ముదురుతున్న ఎండల నేపథ్యంలో మూగజీవాలకు నీటి కొరత లేకుండా చూడాలని బీఎస్పీ మండలాధ్యక్షుడు తక్కెళ్ల నాగార్జున అన్నారు. ఈ మేరకు ఎండీఓ సోమసుందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా నీటి కుంటలను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నేరేడుచర్ల : రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ నర్సయ్య

నేరేడుచర్ల, మార్చి 7 : మండలంలోని మేడారం గ్రామంలో సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, జడ్పీటీసీ రాపోలు నర్సయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొణతం చిన్నవెంకట్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులను చేపట్టినట్లు తెలిపారు.

చింతలపాలెం : మండలంలోని పాత తమ్మవరం గ్రామం నుంచి ఆర్అండ్ఆర్ సెంటర్ తమ్మవరం వరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నరాల కొండారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జానిమియా, గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మోతె : మండల పరిధిలోని గోల్‌తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఎస్‌డీఎఫ్ నిధులతో గ్రామంలో సీసీ రోడ్డు, బోరు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య పాల్గొన్నారు.

మెడికల్ దుకాణాల్లో తనిఖీలు

- నిషేధిత దగ్గుమందు, ట్యాబెట్లు స్వాధీనం

మఠంపల్లి మెడికల్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

కోదాడ రూరల్, మార్చి 7 : కోదాడ పట్టణంతో పాటు మఠంపల్లి మండల కేంద్రంలోని పలు మెడికల్ దుకాణాల్లో డ్రగ్ కంట్రోల్, ఎక్సైజ్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు కలిగించే నిషేధిత దగ్గుమందు టాక్స్ సిరఫ్, నిట్రివేట్-10 ఎంజీ టాబ్లెట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రంలోని న్యూ దుర్గాభవానీ మెడికల్ దుకాణం యాజమాని రమావత్ రవీందర్ తండ్రి ఇంట్లో పది షీట్ల ట్యాబెట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని సరఫరా చేసిన కోదాడ పట్టణంలోని శ్రీవెంకటసాయి సర్జికల్ అండ్ మెడికల్ డిస్ట్రిబ్యూషన్, సాయి దుర్గా ఫార్మా డిస్ట్రిబ్యూషన్‌పై రైడ్ చేసి అమ్మకాల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా మందుల అమ్మకాల పూర్తి వివరాలను అందించాలని నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ శంకర్, ఎస్ఐలు రామకృష్ణ, గోవర్ధన్, యాదయ్య, డ్రగ్ ఇన్స్పెక్టర్ సురేందర్, సిబ్బంది శ్రీనివాస్, అస్గర్, లక్ష్మి, నర్సింహారావు, దాసు, నాగయ్య, రాము, సలీం, నరేశ్ పాల్గొన్నారు.

అనంతగిరిలో ధరణి హెల్ప్‌డెస్క్ ప్రారంభం

అనంతగిరి, మార్చి 7 : మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో ధరణి హెల్ప్ డెస్క్‌ను తాసీల్దార్ రవి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రైతులకు ధరణి పోర్టల్‌పై అవగాహన కల్పించారు. ఫిర్యాదులు, సందేహాలను రైతులు హెల్ప్‌డెస్క్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311802-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777196	చౌటుప్పల్ : 9182777638

ఆలయాల ఉత్సవ కమిటీలు ఎంపిక

చింతలపాలెం, మార్చి 7 : మహా శివరాత్రి జాతర సందర్భంగా మండలంలోని మూడు దేవాలయాలకు ఉత్సవ కమిటీలను దేవాదాయ ధర్మాదాయ శాఖ హైదరాబాద్ వారు నియామకం చేసినట్లు దేవాలయ ఈఓ లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతలపాలెంలోని ఉమామహేశ్వర ఆంజనేయస్వామి దేవస్థాన చైర్మన్‌గా అంబటి రామకృష్ణారెడ్డి, సభ్యులుగా గూడెపు వెంకటేశ్వర్లు, చింతిరాల సైదమ్మ, ఎగుటి నాగరాజు, కారంగుల వీరస్వామి, అర్చకుడిగా నర్ల మహేశ్‌శర్మ నియామకమయ్యారు. చింత్రియాల వేణుగోపాలస్వామి దేవస్థాన చైర్మన్‌గా కొడిమెల రామకృష్ణ, సభ్యులుగా మూలగుండ్ల నర్సింహారెడ్డి, తోడేటి శివకోటేశ్వరి, పోకల గురువయ్య, సంగు లక్ష్మయ్య, చటపంగు రామకోటమ్మ, బొమ్మిడి పుష్పలత అలాగే ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్‌గా ముత్యం వెంకట్‌రెడ్డి, సభ్యులుగా మూలగుండ్ల వెంకటనర్సిరెడ్డి, చటపంగు దేవమ్మ, అల్లం సాంబయ్య, యడపల్లి సాయమ్మ, కటారు నర్సింహారావు నియమితులైనట్లు ఈఓ వెల్లడించారు.

శివరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబు

బొడ్రాయిబజార్ : విద్యుత్ కాంతుల్లో వెలుగులీనుతున్న సూర్యాపేట విద్యానగర్‌లోని రామలింగేశ్వర ఆలయం

అర్వపల్లి : బొల్లంపల్లిలో వేడుకలకు ముస్తాబైన విశాలాక్షి సమేత విశ్వేశ్వర ఆలయం

శివరాత్రి పర్వదినాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించేందుకు దేవాలయాల కమిటీల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్త ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యుత్ దీప కాంతులతో ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. ఆలయాలకు వచ్చే భక్తులకు అభిషేకాలు, పూజల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. శివుడికి అభిషేకాలు, శివపార్వతుల కల్యాణంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు అలాగే ఆలయాల్లో ఉపవాసాలు ఉండే భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. గురువారం ఆయా ఆలయాల్లోని ఏర్పాట్లను మున్సిపల్, పోలీస్ అధికారులు పరిశీలించారు.

కలెక్టర్ పిల్లలమర్రి శివాలయాల సందర్శన

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో గల అతి పురాతన శివాలయాలను కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ దంపతులు గురువారం సందర్శించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేసింది. కార్యక్రమంలో కౌన్సిలర్ బచ్చలకూరి శ్రీనివాస్, శివాలయ కమిటీ చైర్మన్ కొట్ల సైదులుగౌడ్ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు సోమప్ప ఆలయం సిద్ధం

- నేడు పూజలో పాల్గొననున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నేరేడుచర్ల, మార్చి 7 : మండలంలోని సోమారం గ్రామ పంచాయతీ పరిధిలోని చారిత్రక సోమప్ప ఆలయం శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆలయం వద్ద మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, జడ్పీటీసీ రాపోలు నర్సయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొణతం చిన్న వెంకట్‌రెడ్డితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.12 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆ నిధులతో రహదారి మరమ్మతులు, మంచి నీటి బోరు పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా మంత్రి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా రామారావు, ఆలయ వైస్ చైర్మన్ లొడంగి లక్ష్మయ్య, చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు రహీం, మాలోత్ బాలమణి, పగిడిమర్రి సోములు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు టైర్ కిందపడి ప్రయాణికుడి మృతి

సూర్యాపేట అర్బన్, మార్చి 7 : బస్సు వెనుక చక్రాల కింద పడి ప్రయాణికుడు మృతిచెందాడు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో గురువారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నడిగూడెం మండలం వల్లాపురం గ్రామానికి చెందిన కొమ్ము ఆనందరావు (60) సూర్యాపేట నుంచి కోదాడకు వెళ్లేందుకు బస్సు ఎక్కి కూర్చున్నాడు. బస్సు బయల్దేరే సమయంలో కుటుంబ సభ్యులు రావాల్సి ఉన్నదంటూ కదిలే బస్సు వెనుక నుంచి దిగాడు. ఈ క్రమంలో వెనుక టైరు కింద పడడంతో బస్సు కాలుపై నుంచి వెళ్లింది. వెంటనే ఆస్పత్రికి తరలించారు. తీవ్ర రక్తస్రావం కావడంతో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

ఆర్థిక సాయం

నాగారం, మార్చి 7 : మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మట్టగజం అవిలయ్య ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. గురువారం దశదిన కర్మకు ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ తాడోజు వాణి శ్రీకాంత్‌రాజ్ హాజరై అవిలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

బహిరంగ ప్రకటన
ఇందుమూలముగా నా యొక్క క్లయింట్ అయిన చందా శ్రీనువాస రావు, తండ్రి, భిక్షమయ్య, నివాసం కోదాడ గారి నుండి సంజాయిషీ పొంది సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని ముక్కా పద్మావతి, భర్త సుధాకర్‌రావు, నివాసము కోదాడ గారి నుండి ఖరీదు చేసి విక్రయ అగ్రిమెంటు వ్రాయించుకొని కొంత మొత్తం బయానాగా చెల్లించి ఉన్నారు. సదరు ముక్కా పద్మావతి గారు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని రిజిస్ట్రార్ దస్తావేజు నెం.1164/1986 ద్వారా పోలిశెట్టి నర్సయ్య గారి నుండి ఖరీదు చేసి ఉన్నారు. సదరు పోలిశెట్టి నర్సయ్య గారు మరియు వంగవీటి వెంకటేశ్వర్లు గారు, ఓరుగంటి నారాయణ గార్లు జాయింటుగా షేక్ జాన్ మహ్మద్ మరియు అతని కుమారుడు షేక్ హస్సేన్ గారి నుండి ఖరీదు చేసి డా. నెం.545/1969 ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. పై ముగ్గురు మౌఖికంగా భాగపంపిణీ చేసుకొని పొలిశెట్టి నర్సయ్య గారికి వచ్చిన వాటాను ముక్కా పద్మావతిగారికి అమ్మినారు. ఈ రోజు నుండి ఈ షెడ్యూలు ఆస్తి ముక్కా పద్మావతి గారి స్వాధీనంలోనే ఉన్నది. ఇట్టి షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనను వారసత్వ, విక్రయ, తనఖా స్వాధీన మరియు ఏ ఇతరమైన అభ్యంతరాలు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి వారం (7) రోజులలో సరియైన పత్రాలతో వ్రాతపూర్వకంగా తమ అభ్యంతరాలు తెలియజేయగలరు. ఈ సమయంలో ఎటువంటి అభ్యంతరాలు రాని యెడల నా క్లయింట్ మిగతా పైకం చెల్లించి రిజిష్టర్ దస్తావేజును చేసుకొనగలడు. ఆ తర్వాత వచ్చిన అభ్యంతరాలు చెల్లనేరవు.
షెడ్యూలు
నల్లగొండ జిల్లా రిజిష్ట్రార్ గారి అధికార అజ్మాయిషీకి లోనై యుండి కోదాడ తాలూకా సబ్ రిజిష్టార్ గారి కార్యాలయ జ్యూరిడిక్షన్‌లో యున్న కోదాడ గ్రామ పంచాయితీ మరియు రెవిన్యూలో చేరిన మెరక భూమి సర్వే నెం.1065,1066లలో మింజుమలె యేక ఖండముగా వున్న విక్రయ విస్తీర్ణము చ.గ.89లు (ఎనభై తొమ్మిది) చదరపు గజములకు సరియైన 74.420 చదరపు మీటర్లకు హద్దులు:
హద్దులు: ఉత్తరం: ఓరుగంటి నారాయణ గారి ఇల్లు,
దక్షిణం: నేషనల్ హైవే 65 రోడ్డు
తూర్పు: వెంపటి పిచ్చేశ్వరరావు గారి ఖాళీ స్థలం
పడమర: ఓరుగంటి నారాయణ గారి షాపు
సం/- నాగుబండి కృష్ణమూర్తి, మంద వెంకటేశ్వర్లు
అడ్వకేట్స్
ఇంటి నం.3-199/1/సి, పబ్లిక్ క్లబ్ ఎదురుగా, నయానగర్, కోదాడ-508206. సూర్యాపేట జిల్లా.
సెల్ నెం.9848256389

పేదలు గుడిసెలు వేసుకున్న స్థలాలకు పట్టాలు ఇవ్వాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అఖిల్‌కుమార్

మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అఖిల్‌కుమార్

నేరేడుచర్ల, మార్చి 7 : మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 243, 244లోని ప్రభుత్వ స్థలంలో పేద ప్రజలు గుడిసెలు వేసుకున్న స్థలాలకు పట్టాలు ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, సీపీఐ(ఎంఎల్) డివిజన్ కార్యదర్శి వాస పల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో గుడిసెలు వేసిన స్థలాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. గుడిసెలు వేసుకున్న సుమారు 250 మంది ఆరేండ్లుగా పట్టాలు, ఇండ్ల మంజూరు కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పేర్ల నాగయ్య, హుస్సేన్, సందా సత్తమ్మ పాల్గొన్నారు.

దరఖాస్తు ఎవరి పేరున ఉన్నా ఆరు గ్యారెంటీలు అందివ్వాలి

- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గురూజీ

మాట్లాడుతున్న బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గురూజీ

బొడ్రాయిబజార్, మార్చి 7 : కుటుంబ సభ్యుల్లో ఎవరి పేరున దరఖాస్తు చేసుకున్నా ఆరు గ్యారంటీ పథకాలు అందివ్వాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంపటి గురూజీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల్లో ఎవరి పేరున దరఖాస్తు చేసుకున్నా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ క్షేత్రస్థాయిలో ప్రజల్లో గందరగోళం నెలకొన్నట్లు తెలిపారు. రూ.500కే గ్యాస్ అమలు దగ్గరకు వచ్చేసరికి గ్యాస్ ఎవరి పేర ఉంటే వారే దరఖాస్తు చేయాలని నిబంధన పెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నయీమ్, హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్టులు ప్రదానం చేసిన డీఎస్పీ రవి

కరాటేతో ఆత్మస్థైర్యం పెంపు

- డీఎస్పీ రవి

సూర్యాపేట సిటీ, మార్చి 7 : కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని డీఎస్పీ రవి అన్నారు. సుమన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటేడూ అకాడమీ ఆధ్వర్యంలో సీనియర్ కరాటే మాస్టర్ జె.వి.రమణచే నాలుగు నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గురువారం స్థానిక ఎంఎస్ఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యెల్లో, ఆరంజ్ బెల్టులను ప్రదానం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ పాఠశాల కరస్పాండెంట్ కొల్లు శ్రీనివాస్‌రావు, కరాటే మాస్టర్ కిరణ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గరిడేపల్లి ఎస్ఐ-2గా నరేశ్ బాధ్యతల స్వీకరణ

గరిడేపల్లి, మార్చి 7 : గరిడేపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ-2గా చలిగంటి నరేశ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐ-2గా బాధ్యతలు నిర్వహించిన ఎస్‌కె.ఇబ్రహీం వీఆర్‌కు బదిలీపై వెళ్లగా వీఆర్‌లో ఉన్న నరేశ్ ఇక్కడకు వచ్చారు.

కోదాడ మహిళ సుష్మకు అంతర్జాతీయ గుర్తింపు

కోదాడ టౌన్, మార్చి 7 : రద్దీగా ఉండే పట్టణ ప్రాంతాల్లో శుభ్రమైన టాయిలెట్‌ను కనుగొనడం ఇప్పటికీ చాలా మందికి, ముఖ్యంగా మహిళలకు చాలా కష్టమైన పని. ఈ సమస్యను పరిష్కరించింది వైజాగ్‌లో పుట్టి పెరిగి కోదాడ దగ్గరలోని వెంకట్రామపురం అనే గ్రామంలోని మెట్టినింటికి వచ్చిన ఇన్నోవేటర్ సుష్మా కల్లెం పూడి. పబ్లిక్ టాయిలెట్లు నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో మహిళలు ఇప్పటికీ వాటిని ఉపయోగించడం లేదన్న అంశాన్ని గుర్తించిన ఆమె మొబైల్ షీ టాయిలెట్స్ అనే కాన్సెప్ట్‌తో ముందుకు వచ్చారు. దేశంలోనే ప్రథమంగా పైలట్ ప్రాజెక్ట్ కింద కోదాడలో సుమారు రూ.5 లక్షల విలువైన మొబైల్ షీ టాయిలెట్ వినియోగంలోకి తీసుకువచ్చి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేసిన సత్యనారాయణ

మోతె, మార్చి 7 : మండల పరిధిలోని సిరికొండ, మామిళ్లగూడెం జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు అన్నారిగూడెం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఉన్నం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష సామగ్రిని అందజేశారు. మండల స్థాయిలో పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేస్తామని ఈ సందర్భంగా ఉన్నం సత్యనారాయణ తెలిపారు.

కార్యక్రమంలో హెచ్ఎంలు రామనర్సయ్య, వినోద్, మోహన్‌రావు, నాగేశ్వర్‌రావు, లింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

మునగాల, మార్చి 7 : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు హెచ్ఎం సీతారామరాజుకు పాఠశాల పూర్వ విద్యార్థులు గురువారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నల్లపాటి శ్రీనివాస్, ఎర్ర అంజిరెడ్డి, కర్నాటి సుధాకర్, గాడిపర్తి ఉమామహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నాగారంబంగ్లా వాసికి ఓయూ డాక్టరేట్

రమేశ్

నాగారం, మార్చి 7 : మండలంలోని నాగారం బంగ్లా గ్రామానికి చెందిన బాషబోయిన రమేశ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. జంతుశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ వి.వనితాదాస్ ఆధ్వర్యంలో ఉష్ణ మండల ప్రాంత దేశాల్లో డెంగ్యూ వ్యాధి వ్యాప్తి కారక దోమలను నివారించడానికి ప్రత్యామ్నాయ మార్గాలు అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆయన ఈ అవార్డు అందుకున్నారు. దానిపై ఆయన రాసిన సిద్ధాంత గ్రంథం వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించబడింది.